



# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com


### పీఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో

# నాగర్‌కర్నూల్‌కు జాతీయ గుర్తింపు

**కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్**

**జాతీయ స్థాయి మైలురాయి వేడుకలకు హాజరైన జిల్లా ప్రతినిధుల బృందం**



**వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఉత్పాదకత పెంపు, వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకం అమలులో నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ పథకం అమలుకు సంబంధించి న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డు అందుకున్నారు.**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో) : సోమవారం న్యూఢిల్లీలోని ఎన్ఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి

- మిగతా 10లో..



# ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

**ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**పసిఫిక్ మహాసముద్రంపై ఆవరించిన వేడి గాలుల వల్ల ఏర్పడిన సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయని, దీనిని అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.**

వనపర్తి 13 మనం (ప్రతినిధి) : సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు

- మిగతా 2లో..

# వనపర్తి పీజీ కళాశాల, వసతి గృహాలకు 15 కోట్లు

**ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యనభ్యసించే బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల వసతి గృహానికి రూ.7.50 కోట్లు, బాలుర వసతి గృహానికి రూ.7.50 కోట్లు చొప్పున మంజూరయ్యాయని పేర్కొన్నారు.**

9లో..



# భూ రీసర్వేపై సబ్ కలెక్టర్ ఆరా..

**క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం**

**సబ్ కలెక్టర్ సలోని చాప్రా**



ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని అచ్చంపేట రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ సలోని చాప్రా అధికారులను

- మిగతా 2లో..

# ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

మొదటి పేజీ తరువాయి

వేదికల్లో నిర్వహించారు. వనపర్తి మండలం అంకుర్ గ్రామ రైతు వేదికలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో గత ఏడాది కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైందని, రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాబోయే రబీ సీజన్లో రైతులు వరి సాగు చేయవద్దని, తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, నూనె గింజలు సాగు చేయాలని సూచించారు. స్ప్రింక్లర్లు, డ్రిప్ ద్వారా మాత్రమే సాగు చేయాలని, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, నీటి వాడకంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున వృద్ధులు, కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

**వరి వేసి నష్టపోవద్దు : మంత్రి తుమ్మల**

ఎల్ నినో వల్ల ప్రపంచ విపత్తుగా మారిన అధిక ఉష్ణోగ్రతలు, అత్యల్ప వర్షపాతంపై రైతులకు వాస్తవాలు తెలియజేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలే వేయాలని, లేదంటే వేయకున్నా పరవాలేదు కానీ వేసి నష్టపోవద్దని సూచించారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరిందని, జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయిందని, బొగ్గు నిల్వలు లేక థర్మల్ విద్యుత్ కూడా ఆశించిన స్థాయిలో ఉత్పత్తి కావడం లేదన్నారు. అందువల్ల నీరు, విద్యుత్తును పొదుపుగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, ఉద్యాన అధికారి విజయ్ భాస్కర్, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.





## నాయి బ్రాహ్మణ భవనానికి ఎమ్మెల్యే వరం

### రోడ్డు, డ్రైనేజీ, ప్రహరీకి నిధులు!

నాగర్ కర్నూల్, మనం న్యూస్, అక్టోబర్ 12 : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాయి బ్రాహ్మణ సంఘ భవనానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రామస్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా నాయకుడు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... భవనానికి రోడ్డు, డ్రైనేజీ, ప్రహరీ గోడ నిర్మాణం కోసం తన ఎమ్మెల్యే నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 22 ఏళ్ల వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్ తదితరులు పాల్గొన్నారు



# ముద్దపప్పు బతుకమ్మ..ముద్దులొలికే ముత్యపు సిరి

**ఆడ పడుచుల ఆనంద వేడుక..ముద్దుల బతుకమ్మ అపురూప శోభ**

**భాజపా మాజీ నర్సంపల్లి సర్పంచ్ వాగులదాస్ నిరంజన్ గౌడ్**

ఊర్కొండ అక్టోబర్ 12( మనం న్యూస్) : స్థానిక మండల పరిధి గ్రామాలలో ప్రజలు సోమవారం ముద్దపప్పు బతకమ్మతో మహిళా మణులందరూ అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని గ్రామీణ మహిళలందరికీ నర్సంపల్లి భాజాపా మాజీ సర్పంచ్ వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ ముద్దపప్పు బతుకమ్మ శుభాకాంక్షలతో సంభాషిస్తూ తెలంగాణ తల్లి సిగలో సిరిమల్లె తురుము బతుకమ్మ. తొమ్మిది రోజుల తొలకరి మురిపాలలో, 9 రంగుల పూల సింగారంలో 9వ, రకంగా మెరిసే తేజమే ముద్ద పప్పు బతుకమ్మ. ఆ పేరు వింటేనే, నోరూరే కమ్మదనం. కళ్ళ ముందు కదిలే పూల సోయాగం, మనసంతా నిండే మమతల సారం. ఈరోజు ప్రత్యేకత. అసలు ముద్దపప్పు అంటే ఏమిటి? అది కేవలం వంటకం కాదు, అది ఒక వరం. అది ఒక అనుబంధాల అమృతపు ముద్ద. పెసరపప్పు, బియ్యం, నువ్వులు, బెల్లం, నెయ్యి, ఇంగువ, జిలకర కలిపి తల్లి చేతి స్పర్శతో చేసే ఆ మహా ప్రసాదానికి రుచే వేరు మహిమే వేరు అంటూ కొనియాడారు. శరదృతువు సంధిలో వాన వెలిసి, చలి పుట్టే వేళలో, ఒంటికి వెచ్చదనం, కడుపుకు బలం, మనసుకు స్వాంతన ఇచ్చే ఆయుర్వేద అమృతమే ఈ ముద్దపప్పు. మన అవ్వలు, అమ్మమ్మలు, ఆహారమే ఔషధం అని తెలిసి అందించిన జ్ఞాన సంపద ఇది. బియ్యం లో శక్తి, పెసరలో బలం, నువ్వులలో వేడి, ఇంగువలో జీర్ణం, అన్ని కలిసిన సంపూర్ణ పోషణ అని స్పష్టం చేశారు.



**పూలతో గుడి కట్టి..పాటతో పండగ చేసే వేళ**

నేడు తెలంగాణ ఆడపడుచుల సోయాగం చూడవలసిందే, తంగేడు, తలకులతో గునుగు మెరుపులతో, బంతి పసువులతో, చేమంతి తెలుపులతో, రుద్రాక్ష రంగులతో, బతుకమ్మ త్రికోణ శిఖరంలా, మేరు పర్వతంలా పేరుస్తారు. ముద్ద, ముద్దగా పొర, పొరగా అందం, అందంగా పేర్చిన ఆ పూల గట్టును చూస్తే, కన్నులకు పండుగే కాదు, మనసులో ఇంపుగా కనిపిస్తుంది. సాయంత్రం కాగానే, ఊరు చెరువు కట్టపై, గుడి ముంగిట్లో వాడ, వాడలో ఆడపడుచులు వలయాకారంలో చేరుతారు, చప్పట్లు చప్పుడుతో పాటల పరవశంతో ఆకాశం మార్మోగుతుందని ఆకాంక్షించారు. ముద్దపప్పు బతుకమ్మ ముద్దగా ఉన్నది, ముద్దుల చెల్లెళ్లు మురుపంగా ఉన్నారు. పప్పులో బెల్లం కలిపినట్లు, మనసులో మమత కలిపినట్లు వేసిన ముద్దపప్పు..నేతి బిడ్డల ముద్దు మురిపి అంటూ, యాస, ప్రాసతో లయతో పాడే పాటలు వింటే ఎవరి హృదయం అయినా పులకించగా మానదు. ఈ ముద్దపప్పు బతుకమ్మ కేవలం పండగ కాదు అది, ఒక అభినందన వేడుక. కన్న బిడ్డకు గోరుముద్దలు పెట్టే తల్లి ప్రేమకు అభినందన, పుట్టింటి నుండి, అత్తింటికి వచ్చిన ఆడపడుచును, ముద్దచేసి పిలిచే అన్నదమ్ముల అనుబంధానికి అభినందన, పూలను దేవతగా కొలిచే ప్రకృతి ఆరాధనకు అభినందన, నేటి ఫాస్ట్ ఫుడ్ యుగంలో పిజ్జాల, బర్గర్ల, హోరులో, జోరులో మన ముద్దపప్పు రుచులు మరిచిన, మన పిల్లలకు ఈ కమ్మని రుచిని మన సంస్కృతి గొప్పతనాన్ని అందించడం మన బాధ్యత. ముద్దపప్పు బతుకమ్మ సందర్భంగా మండల, గ్రామీణ ఆడపడుచులకు, నా హృదయపూర్వక అభినందనలు. మీ చేతి ముద్దలో ప్రేమ ఉండాలి. మీరు పెట్టే పువ్వులో ఆయుష్షు పెరగాలి. మీరు పేర్చే బతుకమ్మలు, మీ జీవితాలు పూలతో, ఫలాలతో సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ముగించారు.



## దుర్గామాత ఆలయం వద్ద అన్నదానం

వంగూరు, అక్టోబర్ 12 (మనంన్యూస్) : వంగూరు మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో రైతు వేదిక సమీపంలో ప్రతిష్ఠాపించిన దుర్గామాత ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## భూ రీసర్వేపై సబ్ కలెక్టర్ ఆరా..

మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. సోమవారం ఉప్పునుంతల మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం/రైతు వేదిక వద్ద మండల సర్వేయర్, లైసెన్స్డ్ సర్వేయర్లతో సమావేశమై ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, భూముల హద్దుల గుర్తింపు, సర్వే సమయంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు. భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణలో జాగ్రత్తలు పాటిస్తూ రికార్డులను పక్కాగా రూపొందించాలని సిబ్బందికి సూచించారు.

# ఆంధ్రాకు నీళ్లు దోచిపెట్టేందుకే పాలమూరు-రంగారెడ్డిని పడావ్ పెట్టారు

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



వనపర్తి అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : వంద(100) టీఎంసీల కృష్ణా జలాలు పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, వెలిగొండ ద్వారా ఆంధ్రాకు తరలిపోయాయని, నార్లాపూర్ పంపు సిద్ధంగా ఉన్నా ఆన్ చేయకపోవడం నాయకుల నిర్లక్ష్యమని, ఒకట్రెండు రోజుల్లో పంపు ఆన్ చేయకపోతే కార్యాచరణకు దిగుతామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హక్కులేని ఆంధ్రాకు నీళ్లు దోచిపెట్టేందుకే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పడావ్ పెట్టి రైతాంగాన్ని ఆగం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ఆయన పాలమూరు-రంగారెడ్డి లో అంతర్భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్, పంప్ హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. నార్లాపూర్ రిజర్వాయర్, పంప్ హౌస్ సిద్ధంగా ఉన్నా నీళ్లు ఇవ్వకపోవడం వల్ల వానకాలం పంటలు ఎండిపోయి రైతులకు వేలాది కోట్ల నష్టం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు 24 గంటల కరెంట్ ఇస్తే పంపులు ఆన్ చేస్తామని నివేదికలు ఇచ్చినా జిల్లా మంత్రులు పెడచెవిన పెడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో నార్లాపూర్ రిజర్వాయర్ ను సిద్ధం చేసి 145 మెగావాట్ల సామర్థ్యం గల 5 మోటార్లను వెట్ రన్ చేశామని, 2023 సెప్టెంబర్ 16న మాజీ సీఎం కేసీఆర్ ఒక పంపు ఆన్ చేసి నీళ్లు విడుదల చేశారని గుర్తు చేశారు. రిజర్వాయర్ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, ఒక్క పంపు ఆన్ చేస్తే 800 నుంచి 1000 క్యూసెక్కుల నీరు వాడుకోవచ్చని, దీంతో జిల్లాలో 10 వేల కోట్ల వానకాలం పంటలు కాపాడవచ్చని చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల ద్వారా 224 టీఎంసీలు, నల్లమల ద్వారా వచ్చే నీటితో కలిపి మొత్తం 244 టీఎంసీలు వచ్చాయని, అందులో 50 టీఎంసీలు విద్యుత్ ఉత్పత్తికి పోగా మిగతా 180 టీఎంసీలను వాడుకోకుండా ఆంధ్రాకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. అందులో 100 టీఎంసీలు పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, వెలిగొండ ద్వారా తరలిపోయాయన్నారు. కేఎల్ఐలో ఏనాడూ 5 పంపులు నడపలేదని, నీళు ఉండి రైతులకు ఇవ్వని అసమర్థ ప్రభుత్వమిదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి జిల్లా వాసిగా చెప్పుకున్నా జిల్లాకు ఒక్క పని చేయలేదని, బీర్ల కంపెనీకి నీళ్లు ఇవ్వాలనే తపన తప్ప రైతులపై సోయి లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేఎల్ఐ 3 పంపులు 24 గంటలు నడపాలని, నార్లాపూర్ ఒక పంపు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే కార్యాచరణకు సిద్ధమని హెచ్చరించారు.





## భారీ సెట్టింగ్‌తో శమీ వృక్ష శరన్నవరాత్రి ఉత్సవాలు



కొల్లాపూర్ 12 అక్టోబర్ (మనం న్యూస్) : కొల్లాపూర్ పట్టణంలోని శమీ వృక్ష కమిటీ ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవం సందర్భంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి సృష్టి, స్థితి, లయ కార నీవైనా జగన్మాత గాయత్రి దేవి గా రెండో రోజు ఘనంగా పూజలు అందుకుంటున్న గాయత్రి అవతారం ప్రజలందరూ పాడిపంటలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ ఘనంగా పూజలు నిర్వహించారు అమ్మ యొక్క కృప అందరిపై ఉండాలని ఆశీర్వచనాలను పురోహితులు దిలీప్ శర్మ అందించారు ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు బలుమూరు రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి మేకల కిషోర్ యాదవ్ సభ్యులు సురేందర్ సింగ్ మేకల కృష్ణయ్య తదితర భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు



# మహిళా న్యాయం ఏమైంది రాహుల్ జీ?

**బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత యాదవ్**

**వనపర్తిలో కాంగ్రెస్ ఎంపీపై బీజేపీ మహిళా మోర్చా నిరసన**

వనపర్తి అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ యూనివర్సిటీలో 11 మంది విద్యార్థినులను వేధించిన కేసులో దోషిగా తేలి డిస్మిస్ అయిన మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బీమోల్ అకోయిజంను బహిష్కరించాలని వనపర్తిలో బీజేపీ మహిళా మోర్చా నిరసన చేపట్టింది. సోమవారం జిల్లా అధ్యక్షురాలు జి.కవిత యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ యాదవ్ లు హాజరై మాట్లాడారు. అంతకుముందు కవిత యాదవ్ మాట్లాడుతూ ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని, వెంటనే ఎంపీతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జాతీయ అధ్యక్షురాలు రూప్ కుమారి చౌదరి, పురందేశ్వరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయ ముట్టడి జరిగినట్లే వనపర్తిలో కూడా నిరసన తెలిపినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య సెల్ రాష్ట్ర ఈసీ మెంబర్ బాసెట్టి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శులు వారణాసి కల్పన, పెద్దిరాజు, శ్వేతా యాదవ్, సీనియర్ నాయకురాలు సుమిత్రమ్మ, సరోజ యాదవ్, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ గోపీనాథ్, పట్టణ అధ్యక్షులు బత్తిని మధు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, కౌన్సిలర్ విజయ్, మహిళా నాయకురాళ్లు సత్యమ్మ, మహేశ్వరి, పుష్ప భారతి, కౌన్సిలర్ అభ్యర్థి తిరుపతయ్య, బాలపీరు, రాయన్న, చిన్న రాయుడు తదితరులు పాల్గొని "కాంగ్రెస్ హటావో – బేటీ బచావో" అంటూ నినాదాలు చేశారు.



# రైతులను గాలికి వదిలేసి ఢిల్లీ యాత్రలా?

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



వనపర్తి అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : ఎల్ నినో ప్రభావంపై కీలక క్యాబినెట్ సమావేశం, రైతు వేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ అని ప్రకటించి దానిని వాయిదా వేసి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఢిల్లీకి వెళ్లడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. మొన్నటిదాకా ఆరుతడి పంటలు వేసుకోమని ప్రచారం చేసి ఇప్పుడు రెండో పంట వద్దంటూ రైతులను హెచ్చరించడం దుర్మార్గమన్నారు. సాగునీళ్లు మాత్రమే కాదు తాగునీళ్లు, కరెంటు కూడా ఇవ్వలేమని ప్రకటించడం ప్రభుత్వం చేతులెత్తేసిందనడానికి నిదర్శనమని, నీళ్లు ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా మోటార్లు బంద్ పెట్టి రైతాంగం నడ్డి విరిచారని ఆరోపించారు. రాష్ట్రంలో కరెంటు రాక పంటలు ఎండి, లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోయి రైతులు రోడ్లెక్కుతుంటే కాంగ్రెస్ నేతలు విమానాలు ఎక్కి ఢిల్లీకి పోతున్నారని ఎద్దేవా చేశారు. జాతీయ పార్టీలను నమ్ముకుంటే అధోగతి అని కేసీఆర్ అనేకమార్లు చెప్పారని, ఒక్క బీఆర్ఎస్ కే ముందు తెలంగాణ ప్రయోజనాలని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో పండగలా ఉన్న వ్యవసాయం నేడు సంక్షోభంలోకి నెట్టబడిందని, తెలంగాణ సమాజం భవిష్యత్తులో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు.




## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో సర్పంచులకు ప్రాధాన్యం కల్పించాలి

ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రస్తుత సర్పంచులకు ప్రాధాన్యం కల్పించి, పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి, అనంతరం ఎంపీడీఓ వరుణ్ తేజకు వినతిపత్రం అందజేశారు. కొన్ని చోట్ల సర్పంచులకు సమాచారం ఇవ్వకుండానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, ఆరోపించారు. గతంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేసి, ప్రస్తుత సర్పంచుల ఆధ్వర్యంలో కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ సాయిబాబు, వెల్టూర్ సర్పంచ్ చింతోజు వెంకటేష్, లత్తిపూర్ సర్పంచ్ మాన్య నాయక్, పూర్య తండా సర్పంచ్ మోత్యా, గోపాల్, సుమన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బాలస్వామి, రమేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



## వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన, నూతన గృహప్రవేశంలో పాల్గొన్న కవితా మధుసూదన్ రెడ్డి

కొత్తకోట, అక్టోబర్ 12 (మనం న్యూస్): మండల పరిధిలోని వడ్డేవాట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవితా మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం కొత్తకోట పట్టణ కేంద్రంలో చర్లపల్లి గ్రామ సర్పంచ్ సూదిరెడ్డి శోభ శేఖర్ రెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని అనంతరం అమడబాకుల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త మోహన్ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని నూతన వస్త్రాలు (కొత్త బట్టలు) అందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగారపు బీచ్ పల్లి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అరుణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, మదనపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ శరత్ రెడ్డి, సర్పంచులు మండ్ల రాములు, యాదగిరిరెడ్డి, మాసన్న, కౌన్సిలర్లు ఎన్.జె. బోయజ్, జె. సుభాష్,సంజీవుడు పట్టణ అధ్యక్షులు దేశీ పెంటన్న యాదవ్, రాష్ట్ర ఫిషరీస్ కార్యదర్శి సంద వెంకటేష్,బాదం వెంకటేశ్వరులు,సురేందర్ రెడ్డి, మన్నెం వెంకటేష్, తిరుపతి, యాదగిరి, సాయిల్ గౌడ్, పరమేష్,కృష్ణ గౌడ్, బాబు రెడ్డి, నీలవర్ధన్ రెడ్డి జీఎంఆర్ సోషల్ మీడియా కార్తీక్ గౌడ్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మంగంపల్లిలో ఆధునిక శివాలయ నిర్మాణానికి అంకురార్పణ

### కోటి రూపాయల వ్యయంతో చేపట్టే ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దంపతుల భూమి పూజ



పెద్దమందడి, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో కోటి రూపాయల వ్యయంతో ఆధునిక ఆలయ నిర్మాణానికి సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు భూమి పూజ చేశారు. తన స్వగ్రామం మంగంపల్లిపై ఎమ్మెల్యేకు ఉన్న అచంచల భక్తి, మమకారానికి ఈ ఆలయ నిర్మాణమే నిదర్శనమని గ్రామస్తులు కొనియాడుతున్నారు. నియోజకవర్గమంతా అభివృద్ధి చేస్తూనే, పుట్టిన ఊరు ఆధ్యాత్మికంగా వెలుగొందాలనే తపనతో కోటి రూపాయలతో శివాలయాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం ఎమ్మెల్యే గొప్ప మనసుకు నిదర్శనమని భక్తులు పేర్కొంటున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సతీమణి శారదారెడ్డితో కలిసి భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. “దేవాలయం లేని ఊరు ఎడారితో సమానం. మంగంపల్లి లో శివయ్య కొలువుతీరితేనే గ్రామానికి శుభం, సౌభాగ్యం” అనే భావనతో ఎమ్మెల్యే ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని, నూతన ఆలయంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత విస్తరిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.



## రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

### బాధిత కుటుంబానికి 20వేల ఆర్థిక సాయం



వనపర్తి అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : పెద్దగూడెం స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన బుడగ జంగాల కాలనీ వాసులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందజేశారు. గత మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో 9వ వార్డుకు చెందిన వనజ అక్కడికక్కడే మృతి చెందగా, సుహాసిని ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో ఆరుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం బాధితుల ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, నాయకులు బ్రహ్మంచారి, కదిరె రాములు, స్థానిక కౌన్సిలర్ విభూది మహేశ్వరి, మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ, కౌన్సిలర్లు పాకనాటి కృష్ణయ్య, గొల్ల రవి, పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి, అధికార ప్రతినిధి చీర్ల జనార్ధన్, మాజీ కౌన్సిలర్ ఎస్ కే. షఫీ తదితరులు పాల్గొన్నారు.



## నాగర్ కర్నూల్‌లో బీసీల సత్తా చాటుదాం

### 15న తీన్మార్ మల్లన్న పాదయాత్రకు భారీగా తరలిరండి : అరవింద్ చారి

నాగర్ కర్నూల్, మనం (న్యూస్ అక్టోబర్ 12 ) : బీసీల హక్కుల కోసం, సమానత్వం కోసం, రాజ్యాధికారం కోసం తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ గురువారం రోజున బిజినపల్లి మండలం నుండి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం వరకు బీసీ రాజ్యాధికార పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రకు అన్ని కుల సంఘాలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు మరియు పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న బీసీ నాయకులు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చి బీసీల ఐక్యతను చాటాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌడుగు రాజు, బాబు, శివ, జితేందర్, కృష్ణ, వెంకటేష్, హరి తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.



# ఓవర్ లోడ్ లారీలపై ఉక్కుపాదం!

### మనం న్యూస్ కథనానికి స్పందించిన అధికారులు



నాగర్ కర్నూల్, మనం న్యూస్ అక్టోబర్ 12 : సోమవారం మనం న్యూస్ పేపర్ లో ప్రచురితమైన ఓవర్ లోడ్ ఇటుకల లారీల వార్తా కథనానికి జిల్లా రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఉక్కుపాదం మోపారు. జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ హమీద్ ఆదేశాల మేరకు, ఆర్టీవో రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి నాగర్ కర్నూల్ పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మక్తల్ నుండి అక్రమంగా ఓవర్ లోడ్ తో ఇటుకలను తరలిస్తున్న టీఎస్ 06 యూఏ 8429 నెంబర్ గల లారీని పట్టుకొని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ, మనం న్యూస్ పేపర్ కథనానికి వెంటనే స్పందించి ఉక్కుపాదం మోపిన డీటీఓ ఇమ్రాన్ హమీద్, ఆర్టీవో రాజశేఖర్ లను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.



# మాగనూర్ మండల అధ్యక్షుడు జయనంద్ రెడ్డిపై పిర్యాదు

### షోకాజ్ నోటీసు ఇవ్వకుండా అశోక్ గౌడ్‌ను పదవి నుండి తొలగించడం పై అభ్యంతరం

మాగనూర్ 12 (మనం న్యూస్) : మక్తల్ నియోజకవర్గం లోని మాగనూర్ మండల అధ్యక్షులు జయానంద్ రెడ్డి వ్యహార శైలి పై భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ కు పిర్యాదు చేసినట్లు మాగనూర్ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ కి నిబద్ధతతో పనిచేస్తున్న మండల ప్రధాన కార్యదర్శి పదవి నుండి తొలగించి నట్లు పత్రిక ద్వారా వెల్లడించారాని తెలిపారు.తనకు ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వివరణ అడగకుండా పదవినుండి తొలగించడం పై అభ్యంతరం వ్యక్తం చేసారు. పార్టీ కోసం కష్టపడి పని చేసేవాలకు తగిన గౌరవం ఇవ్వాలని, పార్టీ నియమాలను అనుసరించి నిర్ణయాలు తీసుకోవాలని,పార్టీ కార్యకర్తలను కలుపుకొని పోవాలని, ఏక పక్ష నిర్ణయాలు తీసుకోని రాదని తెలియజేసారు. ఈవిదంగా నిర్ణయాలు తీసుకుంటే పార్టీకి నష్టం జరిగి పార్టీలో గ్రూప్ లు ఏర్పాడుతాయని సూచించారు. మండల అధ్యక్షులు జయనంద్ రెడ్డి పై విచారణ జరిపి, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని,పార్టీ పదవినుండి తొలగించే విషయాన్ని పరిశీలించాలని జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఆర్ విద్యాసాగర్,మాజీ మండల అధ్యక్షులు జి. నారాయణ, బి జె పి సీనియర్ నాయకులు మురళీగౌడ్,బి జె వై ఎం నాయకులు భరత్ కుమార్ పాల్గొన్నారు.

# రేవల్లిలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ పూర్తి

### వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన యువ క్రీడాకారులు



రేవల్లి, అక్టోబర్ 12 (మనం న్యూస్): వనపర్తి చాంపియన్‌షిప్–2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలకు సంబంధించి రేవల్లి మండలంలో సోమవారం నిర్వహించిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. కబడ్డీ, క్రికెట్, చదరంగం, ఫుట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్ తదితర క్రీడల్లో యువ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ వరప్రసాద్ రావు తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నారు. క్రీడలు యువత శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయి. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలు అలవడతాయి. జట్టుగా పనిచేయడం, ఇతరుల ప్రతిభను గౌరవించడం, గెలుపోటములను సమానంగా స్వీకరించడం వంటి విలువలను క్రీడలు నేర్పిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు లభిస్తాయి. ఈ ఎంపికల కార్యక్రమంలో ఎంపీడీఓ కీర్తన, ఎంఆర్ఓ సరస్వతి, రేవల్లి జెడ్పీహెచ్ఎస్ పీడీ రమేష్ కుమార్, నాగపూర్ పీడీ శారద తదితరులు పాల్గొన్నారు.





# కనిమెట్టలో వ్యక్తి అదృశ్యం



కొత్తకోట, అక్టోబర్ 12 (మనం న్యూస్): మండల పరిధిలోని కనిమెట్ట గ్రామానికి చెందిన గౌని ధర్మారెడ్డి 68 సం"లు అనే వ్యక్తి అదృశ్యమైన ఘటనపై సోమవారం కొత్తకోట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాల్లోకి వెళితే గౌని శివప్రసాద్ రెడ్డి తన తండ్రి ధర్మ రెడ్డి (68) అదృశ్యంపై పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈనెల అక్టోబర్ 10వ తేదీ (శనివారం)ఉదయం పొలం దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన తండ్రి తిరిగి రాలేదని, చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం పేర్కొన్నారు.

# అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక శిక్షణ

### అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు సమష్టి కృషి చేయాలి




అచ్చంపేట, అక్టోబర్ 12 (మనం న్యూస్) : అటవీ అగ్ని ప్రమాదాలను నివారించడంతో పాటు, ప్రమాదాలు సంభవించినప్పుడు సమర్థవంతంగా నియంత్రించేందుకు అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యంగా అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ చర్యలపై సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని జీటీడీ చౌశింగ హాల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ, దూలపల్లి హైదరాబాద్‌కు చెందిన సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అకాడమీ కోర్సు డైరెక్టర్ కే. శ్రీనివాసులు, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి సీహెచ్. గంగారెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. రవికాంత్ పాల్గొన్నారు. అటవీ శాఖ తరఫున అమ్రాబాద్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ యశ్ చంద్ర ప్రకాష్ సింఘాల్, ఐఎఫ్ఎస్, అచ్చంపేట అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మంటలు వ్యాపించకుండా నియంత్రించే పద్ధతులు, ప్రమాదం జరిగిన వెంటనే చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల వల్ల అటవీ వృక్షసంపద, వన్యప్రాణులు, పర్యావరణానికి కలిగే నష్టాన్ని వివరించి, ప్రమాదాల నివారణలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి ఏటీఆర్ సర్కిల్ పరిధిలోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది, యానిమల్ ట్రాకర్లు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించి, అటవీ అగ్ని ప్రమాదాలను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా నియంత్రించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.





## అయ్యవారిపల్లిలో భూ వివాదం

### న్యాయం చేయాలని గ్రామస్తుల వినతి

**రికార్డుల పరిశీలన చేసి సమస్య పరిష్కరిస్తాం: తహసీల్దార్ సునీత**

ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 115లోని భూమికి సంబంధించిన రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులు, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ అద్దంకి సునీతను కోరారు. 2006లో తమ భూములను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అనంతరం భూముల రికార్డుల సవరణలో తమకు అన్యాయం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. 2014లో సర్వే నంబర్ 115లోని 13 ఎకరాల 17 గుంటల భూమికి సంబంధించిన రికార్డుల్లో మార్పులు జరిగాయని,అ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా కమిటీ ఏర్పాటు

### 14న దేవకి ఫంక్షన్ హాల్‌లో భారీ సమావేశం : రాష్ట్ర అధికార ప్రతినిధి పి. వెంకటేష్



నాగర్ కర్నూల్,( మనం న్యూస్ ) అక్టోబర్ 12) : తెలంగాణ రాష్ట్రంలో అణగారిన వర్గాల గొంతుకను వినిపిస్తూ... సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మాదిగ జర్నలిస్టు ఫోరం ( ఎం జె ఎఫ్ ) నాగర్ కర్నూల్ జిల్లా కమిటీని ఈ నెల 14వ తేదీ బుధవారం రోజున ఏర్పాటు చేయనున్నట్లు మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి పి. వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని దేవకి ఫంక్షన్ హాల్ లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు హాజరై జిల్లా కమిటీని ప్రకటించనున్నారని చెప్పారు.

**మాదిగ జాతి చరిత్ర... పోరాట పటిమకు ప్రతీక!**

మాదిగ జాతి అంటేనే త్యాగం, శ్రమ, పోరాటానికి మారుపేరు. వేల ఏళ్లుగా ఈ సమాజ నిర్మాణంలో తమ చెమటను, రక్తాన్ని ధారపోసిన జాతి మాదిగ జాతి. డప్పు దరువులో తమ ఆవేదనను చర్మకళతో తమ నైపుణ్యాన్ని... చూపిన ఘన చరిత్ర మాదిగలది. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను... మాదిగ దండోరా ఉద్యమ స్ఫూర్తిని... ముందుకు తీసుకెళ్తున్న మాదిగ జర్నలిస్టు ఫోరం... నేడు పత్రికా రంగంలో మాదిగ జర్నలిస్టులకు ఒక వేదికగా నిలుస్తోంది. "కలం పట్టిన ప్రతి మాదిగ బిడ్డ... తన జాతి ఆత్మగౌరవం కోసం రాయాలి... సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలి" అనే లక్ష్యంతో ఈ ఫోరం ఏర్పడింది. పత్రికా రంగంలో ఉన్న మాదిగ జర్నలిస్టుల హక్కులను కాపాడటం, వారికి అండగా నిలవడం, ప్రభుత్వ పథకాల్లో జర్నలిస్టులకు రావాల్సిన వాటా కోసం పోరాడటం ఈ ఫోరం ముఖ్య ఉద్దేశ్యం. కాబట్టి నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న ప్రతి మాదిగ జర్నలిస్టు... ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరూ 14వ తేదీ బుధవారం దేవకి ఫంక్షన్ హాల్ లో జరిగే ఈ ఆత్మీయ సమావేశానికి హాజరై జిల్లా కమిటీ ఏర్పాటును విజయవంతం చేయాలని పి. వెంకటేష్ పిలుపునిచ్చారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### నాగర్ కర్నూల్ జిల్లాఅదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో) : ప్రజా వాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులకు వినతి పత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. ఈ ప్రజావాణిలో 46 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సంబంధిత జిల్లా అధికారులకు అందించి సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ , వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల పరిశీలన

### రంగంపేటలో 7 దరఖాస్తులను పరిశీలించిన ఐసీడీఎస్ అధికారులు



ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): అంగన్‌వాడీ కార్యకర్తల భర్తీ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని సోమవారం రంగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఐసీడీఎస్ బల్మూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన రంగంపేటలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల కోసం వచ్చిన ఏడు దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ సర్పంచ్ చింత గాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ బల్మూరు ప్రాజెక్టు సీడీపీఓ దమయంతి, సూపర్‌వైజర్లు పావని, సునీత దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలించి భర్తీ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

## నీటి బొట్టు వృధా వద్దు

### నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

**జోగులాంబ జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో) : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టి అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. నీటి చుక్క కూడా వృధా పోకుండా ఒడిసిపట్టే విధంగా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. గద్వాల మండలం చెనుగోనుపల్లి గ్రామ రైతు వేదిక వద్ద అదనపు కలెక్టర్ మధుమోహన్ పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. వీసి అనంతరం అదనపు కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ... ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, నీటిపారుదల శాఖ ఇన్చార్జి ఎస్ఈ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, రాజశేఖర్, వ్యవసాయ శాఖ ఏవోలు ప్రతాప్ కుమార్, సాజిద్, ఏఈఓ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి రామ నర్సింహులు, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు

### ఆలయాల్లో భక్తుల సందడి



ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలవ్యాప్తంగా ఆలయాలు, వీధుల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శివాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ కాలనీ (తూర్పు), కోట బురుజు వద్ద యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు.మండలంలోని కంసానిపల్లి, వెల్టూర్, పెనిమెళ్ల, తాడూరు తదితర గ్రామాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో యువజన సంఘాలు, యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, యువతీ యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రతిరోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.



# మిడ్జిల్‌లో భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మిడ్జిల్ అక్టోబర్ 12(మనం న్యూస్) : మిడ్జిల్ మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఈదమ్మ దేవాలయంలో భక్తుల జయజయధ్వనుల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ రోజు పూజా కార్యక్రమాలను మిడ్జిల్ గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి నరేందర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిపించారు. ఉదయాన్నే అర్చకులు శ్రీను అయ్యగారు,సంతోష్ అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, గణపతి పూజ మరియు హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.పూజా సంకల్పం అనంతరం అమ్మవారిని దివ్య మంగళ స్వరూపంలో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ గ్రామానికి చెందిన భవాని స్వాములు, మాలాధారులు, మహిళలు మరియు స్థానిక గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు సాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేవి నవరాత్రుల శుభవేళ అమ్మవారి ఆశీస్సులు మండల ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పూజా నంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# ఇసుక ట్రాక్టర్‌తో సహా వ్యక్తి పట్టివేత.. కేసు నమోదు

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐ పి. మహేష్ హెచ్చరిక

### అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్

### అక్రమార్కులపై నిరంతర నిఘా



ఉప్పునుంతల అక్టోబర్ 12 మనం న్యూస్ : మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పునుంతల ఎస్ఐ పి. మహేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే సహించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో సోమవారం ఉదయం పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన షేక్ బురాన్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సదరు ట్రాక్టర్‌ను అడ్డుకొని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేవని తేలింది. దీంతో ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, షేక్ బురాన్‌పై అక్రమ ఇసుక రవాణా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించబోం**

ఈ సందర్భంగా ఎస్ఐ పి. మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వాగులు, వంకల నుంచి అక్రమంగా ఇసుకను తవ్వడం, రవాణా చేయడం లేదా అనుమతి లేకుండా నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ట్రాక్టర్లు, లారీలు లేదా మరే ఇతర వాహనాల ద్వారా ఇసుక దందా సాగిస్తే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మండల పరిధిలో అక్రమ ఇసుక వ్యాపారంపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, అక్రమ మార్గాల్లో ఇసుక తరలించి ఇబ్బందుల్లో పడొద్దని సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పి. మహేష్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలి

**జిల్లా ఎస్పీ డి.జానకి**

మహబూబ్ నగర్, 12అక్టోబర్, (మనం న్యూస్) : మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఇతర సమస్యలకు సంబంధించి అందజేసిన దరఖాస్తులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి, సమస్యల వివరాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగిన ఆదేశాలు జారీ చేశారు.ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని, ప్రతి దరఖాస్తుపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను సంప్రదించినప్పుడు వారికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.



# అభివృద్ధికి అడుగు..మురుగునకు ముగింపు

**మురుగు నీటికి ముకుతాడు.. మండలానికి మణిహారం**

**ఎస్సీ సబ్ ప్లాన్ తో సుందర స్వప్నం..ఎమ్మెల్యే అండతో అభివృద్ధి పర్వం**

**రూ.33 లక్షల..మురుగునీటి కాలువల శంకుస్థాపన**

**స్థానిక సర్పంచి మేకల మంజుల శ్రీనివాస్**



ఊరుకొండ అక్టోబర్ 12 (మనం న్యూస్) : స్థానిక మండల కేంద్రంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అండదండలతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో 33 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక సర్పంచ్ మేకల మంజుల శ్రీనివాస్ వ్యాఖ్యానిస్తూ పరిశుభ్రతే పరమావధిగా ప్రజా ఆరోగ్యమే పరమార్థంగా,మండల కేంద్రం నవ శోభసంతరించుకోబోతుంది .చెత్తా, చెదారంతో మురుగునీటి ముంపుతో ఇక్కట్లు పడుతున్న,ప్రజల కష్టాలకు చరమగీతం పాడే రోజు వచ్చింది.సర్పంచ్ నేతృత్వంలో అండర్ డ్రైనేజ్ పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామం గమనం అభివృద్ధి వైపు,ప్రజల మనం స్వచ్ఛత వైపు,మురుగు వీడి మెరుగు బాటలో మండలం నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పరిశుభ్రత పరిమళించేలా,అభివృద్ధి పరుగులు పెట్టేలా,మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన,మురుగు సమస్యను ముగింపు పలుకుతూ దుర్గంధానికి చరమగీతం పాడుతూ,గ్రామపంచాయతీ కీలక అడుగు వేసింది.మురుగు వీడి,మెరుగు బాటలో నడిచేందుకు అండర్ డ్రైనేజీ పనులను,సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయాలని కోరారు.మండల కేంద్రశీ చిరకాల స్వప్నం నేడు సహకారం అయింది.ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ,33 లక్షల బృహత్తర పథకాన్ని చేపట్టడం జరిగింది.ఈ పనుల వల్ల వర్షాకాలంలో రోడ్లపై నిలిచే మురుగునీరు,ఈగల,దోమల బెడద,రోగాల ముప్పు,పూర్తిగా తొలగనున్నాయి.ఇది కేవలం డ్రైనేజ్ కాదు,ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచం.గ్రామ సౌందర్యానికి మణిహారం అంటూ కీర్తించారు.ఈ మహత్తర కార్యం వెనక జడ్చర్ల నియోజకవర్గ యువ కెరటం అభివృద్ధి ప్రదాత గౌరవ శాసన సభ్యుడు జనమల్లి అనిరుద్ రెడ్డి తోడ్పాటు ప్రోత్సాహం,కొండంత అండగా నిలిచాయని నినదించారు.నిధులు మంజూరు నుండి,పనుల ప్రారంభం వరకు ఎమ్మెల్యే ప్రతి అడుగులోనూ చొరవ,చూపు స్పష్టంగా కనిపిస్తుంది.ప్రజల సంక్షేమం,ఆలోచన ఆశయానికి అద్దం పట్టేలా ఈ పథకశీ రూపుదిద్దుకుంటుందని,మండల అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి ధన్యవాదాలు అంటూ ముగించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఉ పసర్పంచ్ పోలే రాజు,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ యువజన సంఘ అధ్యక్షుడు ఆదినారాయణ,మండల అధ్యక్షుడు అయ్యుబ్ పాషా,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్,మాజీ ఉపసర్పంచి కంతం యాదయ్య,కార్యదర్శి గ్రామ పెద్దలు,యువజన సంఘం నాయకులు,మహిళా సంఘ సభ్యులు,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో నుంచి మన గ్రామాన్ని మనమే కాపాడుకుందాం

**జేపల్లి సర్పంచ్ అమీనా అశోక్ రాథోడ్**



చారకొండ,అక్టోబర్12(మనం న్యూస్) : నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ అమీనా అశోక్ అన్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు,వర్షపాతం తగ్గడం,తాగునీటి కొరత వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మన గ్రామ పంచాయతీ పరిధిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, గ్రామ ప్రజలందరం కలిసికట్టుగా పరిష్కరించు కుందామని సోమవారం సర్పంచ్ ప్రకటనలో తెలిపారు. నీటిని వృధా చేయకుండా ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావించి ఆదా చేసుకుందామని గ్రామ ప్రజలకు తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ ఉపయోగ వస్తువులు, ఇంటిలో లైట్లు ఫ్యాన్ అవసరం ఉన్నప్పుడే వాడుకొని విద్యుత్ ను పొదుపుగా వాడుకుందామని, నీటి సమస్య నల్లాల ద్వారా నీరు వృధా పోకుండా అరికట్టాలని సూచించారు.ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం.పర్యావరణాన్ని కాపాడుదాం గ్రామ ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకారం ఎంతో అవసరమని కనుక అందరం కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి సహకరిద్దామని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.




# సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్‌పై దాడిని నిరసిస్తూ కొత్తకోటలో సీపీఎం నిరసన

కొత్తకోట, అక్టోబర్ 12 (మనం న్యూస్): సీపీఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ పై దాడిని, సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితర నాయకుల అక్రమ అరెస్టును నిరసిస్తూ కొత్తకోట చౌరస్తాలోని ముఖ్య కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోమవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ వద్ద ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై వచ్చిన ఆరోపణలపై విద్యార్థి, యువజన సంఘాలు శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా కేంద్ర బలగాలు దాడి చేశాయని, విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్లిన ఎంపీ బ్రిట్టాస్ ను మీడియాతో మాట్లాడుతుండగా బలవంతంగా లాక్కెళ్లి దాడి చేసి గొంతు నులిమి రోడ్డు పక్కన పడేశారని ఆరోపించారు. గాయపడిన బ్రిట్టాస్ ప్రస్తుతం ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, నాయకులు యాదయ్య, కురుమన్న, శివన్న, వెంకటన్న, మల్లేష్, గోపాల్, పెద్ద కురుమన్న పాల్గొన్నారు.

# అచ్చంపేటకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**అక్టోబర్ 14న విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన..**

**జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీ రాయల గండి లో ఆలయ గాలి గోపురం పనులకు భూమిపూజ!**

**మన్ననూరు, అమ్రాబాద్, అచ్చంపేట ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు రోజుల పర్యటన**



అచ్చంపేట, అక్టోబర్ 12 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ నెల 14, 15 తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఆయన పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేసింది. పర్యటనలో భాగంగా అమ్రాబాద్, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**మన్ననూరులో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన**

ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 11 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చేరుకుంటారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన అనంతరం ఉదయం 11.05 నుంచి 11.45 గంటల మధ్య మన్ననూరులో 220/30 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసి రైతులతో మాట్లాడనున్నారు. అనంతరం అమ్రాబాద్ పట్టణంలో ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

**జ్యోతి నాయక్ తండాలో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ**

అమ్రాబాద్ పర్యటన అనంతరం పదర మండల పరిధిలోని జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీలో రాయలగండి-శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12.45 నుంచి 1.15 గంటల మధ్య జరగనున్నట్లు పర్యటన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనతో ఆలయ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం లభించనుంది.

**అచ్చంపేట పరిధిలో నాలుగు విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు**

మధ్యాహ్నం 2.30 గంటలకు మన్ననూరు నుంచి అచ్చంపేటకు బయలుదేరి, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు విద్యుత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఐపీడీఎస్ పథకం కింద 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం తరలింపు, సిద్ధాపూర్‌లో నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, బల్మూరు మండలం రామాజిపల్లిలో నూతన విద్యుత్ ఉపకేంద్రం, వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లిలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాల అనంతరం అచ్చంపేట నుంచి దోమలపెంటలోని బ్రహ్మగిరి అతిథిగృహానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

**15న అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో పర్యటన**

ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 9.30 గంటలకు బ్రహ్మగిరి అతిథిగృహం నుంచి అమ్రాబాద్ పులుల అభయారణ్యం పులుల సఫారీ ప్రాంతానికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు చేరుకుంటారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు కల్పించాలని కార్యాలయం ఆదేశించింది. ఆయన పర్యటనతో అచ్చంపేట, అమ్రాబాద్ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలు, రహదారులు, ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యక్రమాలు ముందుకు సాగనున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తిర్మాలాపూర్‌లో విషాదం..**



ఉప్పునుంతల, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఉప్పునుంతల--గట్టుకాడిపల్లి మార్గంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిర్మాలపూర్ గ్రామానికి చెందిన తిప్పర్తి నరసింహారెడ్డి మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, గ్రామంలో విషాదం నెలకొంది.




# అమ్రాబాద్‌లో సర్పంచ్, ఉపసర్పంచ్ చెక్ పవర్ నిలిపివేత!

**ఐదు రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని డీపీఓ ఆదేశం**

**ఎంపీడీవోకు చెక్కులపై సంతకం చేసే అధికారం.. జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఉత్తర్వులు**

అచ్చంపేట, అక్టోబర్ 12 (మనం న్యూస్) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ గ్రామ పంచాయతీలో పెండింగ్ అభివృద్ధి పనుల బిల్లుల వ్యవహారం కీలక మలుపు తిరిగింది. గత పాలకవర్గం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులపై జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పి. శ్రీరాములు కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుత సర్పంచ్ చిగుర్ల కోటయ్య, ఉపసర్పంచ్ నోముల రాజారాం గౌడ్‌లకు ఉన్న చెక్ పవర్ అధికారాలను నిలిపివేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులకు జిల్లా కలెక్టర్ ఆమోదం లభించినట్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్నారు.

**మాజీ సర్పంచ్ ఫిర్యాదుతో విచారణ**

అమ్రాబాద్ మాజీ సర్పంచ్ దుమావత్ శారద 2019–2024 మధ్య తన పదవీకాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు పూర్తయినప్పటికీ ప్రస్తుత సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 2026 మార్చి 16, మార్చి 30, మే 1 తేదీల్లో సంబంధిత అధికారుల కు ఫిర్యాదులు చేసినట్లు ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. ఫిర్యాదులపై స్పందించిన డీపీఓ ప్రస్తుత సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణలు కోరారు. పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనుల పురోగతి, పూర్తిస్థాయి వివరాలు, సాంకేతిక ధ్రువీకరణపై స్పష్టత కోసం సంబంధిత ఇంజినీరింగ్ విభాగాల నుంచి నివేదికలు తెప్పించారు.

**పూర్తయిన పనులకు సాంకేతిక ధ్రువీకరణ**

జిల్లా మైనర్ ఇరిగేషన్ విభాగం, పంచాయతీరాజ్ పీఐయూ విభాగాల అధికారులు సమర్పించిన నివేదికల్లో మాజీ సర్పంచ్ హయాంలో చేపట్టిన పనులు పూర్తయినట్లు, సాంకేతికంగా ధ్రువీకరించినట్లు పేర్కొన్నారని ఉత్తర్వుల్లో వివరించారు. నిబంధనల ప్రకారం బిల్లుల చెల్లింపును పరిశీలించవచ్చని సంబంధిత నివేదికలు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలు, సంబంధిత వ్యక్తుల వివరణలను పరిశీలించిన అనంతరం పెండింగ్ బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యంపై డీపీఓ చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ ఎంఎస్ నంబర్ 30, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ, తేదీ జనవరి 20, 1995లోని రూల్ 42 ప్రకారం సర్పంచ్, ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ అధికారాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**ఎంపీడీవోకు చెక్కులపై సంతకం చేసే అధికారం**

సర్పంచ్, ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ నిలిపివేయడంతో గ్రామ పంచాయతీ ఆర్థిక లావాదేవీలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ మెమో ప్రకారం, గ్రామ పంచాయతీ తీర్మానించిన వార్డు సభ్యుడితో కలిసి చెక్కులపై సంతకం చేసే అధికారాన్ని అమ్రాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రమణకు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నిధుల చెల్లింపులు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ఎంపీడీవో పర్యవేక్షణలో చర్యలు చేపట్టనున్నారు. ఎంపీడీవో సమర్పించే చెక్కులను నిబంధనల ప్రకారం అనుమతించాలని సంబంధిత సబ్ ట్రెజరీ అధికారి, జాతీయ బ్యాంకుల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాల్లో వివరించారు.

**ఐదు రోజుల్లో బిల్లులు చెల్లించాలని ఆదేశం**

మాజీ సర్పంచ్ హయాంలో చేపట్టి పూర్తయినట్లు నివేదికల్లో పేర్కొన్న పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ఐదు రోజుల్లోగా చెల్లించాలని డీపీఓ ఆదేశించినట్లు ఉత్తర్వుల సారాంశం వెల్లడిస్తోంది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అమ్రాబాద్ గ్రామ పంచాయతీలో పెండింగ్ బిల్లుల వ్యవహారం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడటం, గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం ఎంత ముఖ్యమో ఈ పరిణామం మరోసారి స్పష్టం చేస్తోంది.

# వనపర్తి పీజీ కళాశాల వసతి గృహాలకు 15 కోట్లు

వనపర్తి, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) :ఉన్నత విద్యను అభ్యసించేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవిలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.



# ప్రజలకు మెరుగైన పాలనే లక్ష్యం..

**విద్యుత్ శాఖ భవనానికి శంకుస్థాపన!**

నాగర్ కర్నూల్, మనం న్యూస్, అక్టోబర్ 12 : ప్రజలకు మెరుగైన పరిపాలనా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నూతన కార్యాలయ భవనాలను నిర్మిస్తున్నామని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తాలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు నూతన భవనాలు నిర్మిస్తూ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ఎమ్మార్వో, రెవెన్యూ తదితర కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తున్నామని వివరించారు. విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ... ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ తీగల స్వప్నేంద్ర, పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ పడిగె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కాలనీలో గాయత్రీ దేవిగా దుర్గామాత

**కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేసిన మహిళలు**



వనపర్తి, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని 25వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో దుర్గామాత సోమవారం గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి పునీతులను చేసింది. వేదమాతగా, సకల వేదాలకు మూలమైన గాయత్రీ దేవి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం సకల పాపహరణమని భక్తుల నమ్మకం. “ముక్తా విద్రుమ హేమ నీల ధవళచ్ఛాయైః ముఖైస్త్రీక్షణైః...” అంటూ వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కాలనీవాసుల కోరిక మేరకు అదే కాలనీకి చెందిన శారదా చారి తన సొంత నిధులతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన వడల దండకాన్ని సమర్పించి, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు దుర్గామాత నవదుర్గల రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనుందని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. గాయత్రీ దేవి దర్శనంతో సకల విఘ్నాలు తొలగి, జ్ఞానం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని మహిళా భక్తులు పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో కాలనీ మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరిని మరో అరుణాచలంగా తీర్చిదిద్దుతా

## నేను ఎమ్మెల్యేనైనా స్వామివారి సేవకుడినే

### ప్రతి మాస శివరాత్రికి గిరి ప్రదక్షిణ

**ఎమ్మెల్యే మేఘారెడ్డి**



పెద్దమందడి, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) : మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరిపై కొలువైన మహాశివుడి క్షేత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లోనే దేదీప్యమాన క్షేత్రంగా తీర్చిదిద్దుతానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రకటించారు. ఇక్కడ గిరి ప్రదక్షిణ చేస్తే అరుణాచల గిరి ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం లభిస్తుందన్నారు. పామిరెడ్డిపల్లి వైరాగ్యగిరి గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని సోమవారం సతీమణి శారదా రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, శివనామస్మరణ మధ్య భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "శివుడిని నమ్మిన వారికి కొండంత అండ ఉంటుంది. గిరి ప్రదక్షిణతో సర్వపాపాలు తొలగి మోక్షం సిద్ధిస్తుంది. ఆధ్యాత్మిక చింతనకు మించిన ప్రశాంతత లేదు. నేను ఎమ్మెల్యే కాకముందే ఈ శివయ్యకు కృష్ణా జలాలతో అభిషేకం చేయించాను. నేను ఎమ్మెల్యేనైనా ఒక సేవకుడిగానే, స్వామివారి భక్తుడిగానే ఉంటాను" అని పేర్కొన్నారు. ప్రతి నెలా మాస శివరాత్రికి అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహిస్తామని, ఆలయ అభివృద్ధికి రూ.25 లక్షలు అందజేస్తానని తెలిపారు. గిరి ప్రదక్షిణను విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# దసరా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

## ప్రజలకు అసౌకర్యం కలగొద్దు: ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, మనం న్యూస్, అక్టోబర్ 12 : నాగర్ కర్నూల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై దసరా పండుగ సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్ సునేంద్రతో కలిసి ఆయన ట్యాంక్ బండ్ పరిసరాలను పరిశీలించి... పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్యాంక్ బండ్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. దసరా వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని... సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలు పండుగను సంతోషంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, పట్టణ అధ్యక్షుడు జక్కా రాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# పీఎం ధన్-ధాన్య కృషి యోజన అమలులో నాగర్‌కర్నూల్‌కు జాతీయ గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

ధన్-ధాన్య కృషి యోజనను అమలు చేస్తోంది. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తూ రైతులకు మెరుగైన సాగు అవకాశాలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సాగునీటి వనరుల సమర్థ వినియోగం, పంటల దిగుబడుల మెరుగుదల, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు వ్యవసాయాభివృద్ధిలో కీలకంగా నిలుస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పథకం అమలులో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో జాతీయ స్థాయి మైలురాయి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నలుగురు సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఓ శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి ఈ బృందంలో పాల్గొన్నారు.




# పనికి తగ్గ వేతనం ఏదీ?

## కుటుంబ పోషణ భారంగా మారింది.. మల్టీపర్పస్ వర్కర్ల ఆవేదన!

### కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి

### నేడే హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి భారీగా తరలిరావాలి

అచ్చంపేట, అక్టోబర్ 12 (మనం న్యూస్) : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రీ-మెట్రిక్ హాస్టళ్లు, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని డిమాండ్ పెరుగుతోంది. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు తదితర భారాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.



### తక్కువ వేతనాలతో కుటుంబ పోషణ కష్టం

గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమం కోసం మల్టీపర్పస్ వర్కర్లు కీలక సేవలందిస్తున్నారు. పరిశుభ్రత, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల అవసరాలు, ఇతర రోజువారీ పనులను నిర్వహిస్తూ సంస్థల కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషి చేస్తున్నారు. అయినప్పటికీ తమ శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జీవో నంబర్ 64 ప్రకారం నెలకు సుమారు రూ.11,700 మాత్రమే చెల్లిస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఈ మొత్తంతో కుటుంబ అవసరాలను తీర్చుకోవడం, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చులు భరించడం కష్టతరంగా మారిందని చెబుతున్నారు. పనికి తగిన వేతనం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి

గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో మల్టీపర్పస్ వర్కర్లకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించేవారని కార్మికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం జీవో నంబర్ 64 ప్రకారం తక్కువ వేతనాలు చెల్లిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. ఇతర జిల్లాల్లో కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలతో పాటు ఏజెన్సీ, మున్సిపాలిటీ అలవెన్సులు కలిపి నెలకు రూ.27 వేలకుపైగా అందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ అదే తరహా వేతన విధానాన్ని అమలు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకే శాఖలో ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జిల్లాల వారీగా వేతనాల్లో వ్యత్యాసం ఉండటం అన్యాయమని వారు అభిప్రాయపడుతున్నారు. గతంలో అమలైన వేతన విధానాన్ని పునరుద్ధరించి, కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

### నేడే హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి తరలిరండి

మల్టీపర్పస్ వర్కర్ల వేతన సమస్యల పరిష్కారం కోసం నేడు హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు సంబంధిత ప్రాంతాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాలని కోరుతున్నారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాల చెల్లింపు, తగిన అలవెన్సుల అమలు, వేతన వ్యత్యాసాల తొలగింపు వంటి ప్రధాన డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిస్తున్నారు.

### ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ఏళ్ల తరబడి గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం సేవలందిస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని కార్మికులు కోరుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు, పనికి తగిన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమ కుటుంబాలను గౌరవప్రదంగా పోషించుకునే పరిస్థితులు కల్పించాలని, ఇతర జిల్లాల్లో అమలవుతున్న వేతన విధానాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నేటి హైదరాబాద్ తరలింపుతోనైనా తమ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం కావాలని మల్టీపర్పస్ వర్కర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.